అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
బుధవారం 10 మే 2023

కస్తూర్బాలో వంద శాతం ఉత్తీర్ణత

నవతెలంగాణ - చింతలమానేపల్లి

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో కస్తూరిబా విద్యార్థినులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరం బైపిసి 40/40, ఎంపిసి 12 /12 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో బైపిసి 19/19, ఎంపీసి 04/04 ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్ఓ శ్రీజ నందిని తెలిపారు.

తాండూర్ : కేజీబీవీ విద్యార్థినులు ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ఎస్ఓ కవిత తెలిపారు. మొత్తం 65 మంది విద్యార్థినులు పరీక్షకు హాజరుకాగా 60 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ఏ గ్రేడ్‌లో 45 మంది, బి గ్రేడ్ 17 మంది, సి గ్రేడ్‌లో ఒకరు ఉత్తీర్ణులయ్యారు. 968 మార్కులతో బొడ్డు సుష్మ టాపర్‌గా నిలిచింది. మొదటి సంవత్సరం ఫలితాల్లో కూడా ఉత్తమ ఫలితాలు సాధించినట్లు వివరించారు. దుర్గం మమత 490 మార్కులు పొంది టాపర్‌గా నిలిచింది. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఎస్ఓ, బోధన సిబ్బంది అభినందించారు.

ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన సంయుక్తకు సన్మానం



నస్పూర్ : శ్రీరాంపూర్ ఏరియా ఐటి విభాగంలో సీనియర్ ప్రోగ్రామర్ ఐటి శ్రీనివాస్ కూతురు గొల్లల సంయుక్త ఎంఈసి ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 500 మార్కులకు 498 మార్కులతో తెలంగాణ రాష్ట్ర రెండో ర్యాంకు సాధించింది. శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు వారి పిల్లలను ఉన్నత చదువులు చదివించడం, అలాగే వారు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించడం చాలా అభినందించదగిన విషయమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ పి అరవిందరావు, క్వాలిటీ మేనేజర్ కె.వెంకటేశ్వర్‌రెడ్డి, సీనియర్ పిఓ కాంతారావు పాల్గొన్నారు.

కుమురం భీం-ఆసిఫాబాద్ టాప్..!

- రాష్ట్రంలో రెండో స్థానం..ఉమ్మడి జిల్లాలో ప్రథమం
- ఆ తర్వాతి స్థానాల్లో నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలు
- 17వ స్థానంలో నిలిచిన మంచిర్యాల
- నాలుగు జిల్లాల్లోనూ బాలికలదే పైచేయి
- ఇంటర్ ఫలితాల్లో ఉమ్మడి జిల్లా విద్యార్థుల ప్రతిభ

ఇంటర్మీడిట్ వార్షిక ఫలితాల్లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. ఇంటర్, ప్రథమ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రంలో మిగితా జిల్లాలతో పోల్చితే జిల్లా విద్యార్థులు మంచి ప్రతిభను కనబర్చారు. మంగళవారం వెల్లడైన ఇంటర్ ఫలితాల్లో కుమురంభీం-ఆసిఫాబాద్ జిల్లా 81శాతం ఫలితాలతో రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలువగా.. ఉమ్మడి జిల్లాలో మొదటి స్థానం కైవసం చేసుకుంది. తర్వాతి స్థానాల్లో నిర్మల్ 69శాతం, ఆదిలాబాద్ 68శాతం, మంచిర్యాల జిల్లా 64శాతంతో నిలిచాయి. కిందటేడాదితో పోల్చితే ఈ ఏడాది ఫలితాలు మరింత మెరుగుపడ్డాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో గతేడాది కుమురంభీం జిల్లా రెండో స్థానం దక్కించుకోగా.. ఈ ఏడాది రెండో స్థానంలోనే నిలిచినా ఉత్తీర్ణత శాతం పెరగడం గమనార్హం. నిర్మల్ జిల్లాలోనూ రెండు శాతం పెరుగగా.. ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలు మాత్రం కిందటేడాది శాతాన్నే ఈ ఏడాది కూడా సాధించాయి. ప్రస్తుతం నాలుగు జిల్లాల్లోనూ ఉత్తీర్ణతలో బాలుర కంటే బాలికలే పైచేయి సాధించారు.



ఆసిఫాబాద్ డీఐఈఓ కార్యాలయంలో సంబరాలు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్ ఫలితాల్లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు మంచి ప్రతిభ కనబర్చారు. కిందటేడాదితో పోల్చితే ఈ ఏడాది ఉత్తీర్ణత శాతాన్ని మరింత పెంచారు. కిందటేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో నిలువగా.. తొమ్మిదో స్థానంలో నిర్మల్, 12వ స్థానంలో ఆదిలాబాద్ జిల్లా నిలిచాయి. మంచిర్యాల జిల్లా 17వ స్థానంలో నిలిచి ఫర్వాలేదనిపించుకుంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 24,770మంది పరీక్షలు రాయగా 15,596మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 24,016మంది పరీక్షలు రాయగా 16,770మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లోనూ బాలుర కంటే బాలికలే అధికశాతం ఉత్తీర్ణత సాధించారు.

ఇంటర్ ప్రథమ సంవత్సరంలో

ఇంటర్ ప్రథమ సంవత్సరంలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా 73శాతం ఉత్తీర్ణత సాధించింది. 4371మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 3227మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 2066 మంది పరీక్షలు రాయగా 1407 మంది పాసయ్యారు. బాలికలు 2305మంది పరీక్షలు రాయగా 1820మంది ఉత్తీర్ణత సాధించారు. నిర్మల్ జిల్లాలో 5816మందికి గాను 3650మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 2642మందికి గాను 1331మంది, బాలికలు 3174కి గాను 2319మంది ఉత్తీర్ణులయ్యారు. ఆదిలాబాద్ జిల్లాలో 8927మంది విద్యార్థులకు గాను 5490మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 4505మందికి గాను 2358 మంది, బాలికలు 3174మందికి గాను 2319మంది ఉత్తీర్ణులయ్యారు. మంచిర్యాల జిల్లాలో 5656మందికి గాను 3229మంది పాసయ్యారు. ఇందులో బాలురు 2616మందికి గాను 1215మంది, బాలికలు 4422మందికి గాను 3132మంది ఉత్తీర్ణత సాధించారు. వృత్తి విద్యా కోర్సుల్లో ఉమ్మడి జిల్లాలో 4348మంది పరీక్షలు రాయగా 2392మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

ద్వితీయ సంవత్సరంలో..

ఇంటర్ ద్వితీయ సంవత్సరంలోనూ ఉమ్మడి జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 4000మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 3249మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 1842 మంది పరీక్షలు రాయగా 1389మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 2158మంది రాయగా 1860మంది పాసయ్యారు. నిర్మల్ జిల్లాలో 5664మంది విద్యార్థులకు గాను 3910మంది పాసయ్యారు. ఇందులో బాలురు 2669మందికి గాను 1566మంది ఉత్తీర్ణులు కాగా బాలికలు 2995మందికి గాను 2344మంది పాసయ్యారు. ఆదిలాబాద్ జిల్లాలో 8442మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 5808మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 4240మందికి గాను 2602మంది పాసయ్యారు. బాలికలు 4202మంది పరీక్షలు రాయగా 3206మంది ఉత్తీర్ణులయ్యారు. మంచిర్యాల జిల్లాలో 5910 మంది విద్యార్థులకు గాను 3803 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 2612 మందికి గాను 1454మంది పాసయ్యారు. బాలికలు 3298 మందికి గాను 2349మంది ఉత్తీర్ణులయ్యారు. ఉమ్మడి జిల్లాలో వృత్తి విద్యా విద్యార్థులు 3833మంది పరీక్షలు రాయగా 2658మంది ఉత్తీర్ణులయ్యారు. విద్యార్థులను ఆయా కళాశాలల యాజమాన్యం, అధికారులు, అధ్యాపకులు అభినందించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో టీబీజీకేఎస్ విఫలం

నవతెలంగాణ - రెబ్బెన

కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో టీబీజీకేఎస్ విఫలమైందని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి సోమారం తిరుపతి విమర్శించారు. మంగళవారం కేఎల్ మహేంద్ర భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బెల్లంపల్లి ఏరియాకు సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌గా సింగరేణి వ్యాప్తంగా కార్మికుల నుండి దరఖాస్తులు తీసుకొని అందులో 96 మందికి అవకాశం కల్పించారని, ఇది టీబీజీకేయస్ యూనియన్ చేతకానితనమే అన్నారు. 2018-19 సంవత్సరంలో జనరల్ మజ్దూర్ తీసుకొని గోలేటికి వచ్చిన కార్మికులను కూడా టీబీజీకేయస్ మోసం చేసిందన్నారు. వారికి కూడా ఇదే నిబంధనను వర్తింప చేసే కార్మికులు వేతనాలు నష్టపోయారన్నారు. గోలేటి(1), 1(ఎ) గని మూతపడినప్పుడు జనరల్ మజ్దూర్ కార్మికులు, మాస్టర్ జాబ్ కార్మికులందరు సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అప్పుడే కొత్త సర్క్యూలర్ తీసుకొచ్చి ఇదే విధంగా కార్మికులను బేసిక్ ప్రొటెక్షన్ ఇవ్వకుండా బేసిక్ తగ్గించి మొదటి కేటగిరి ఇవ్వడం జరిగిందన్నారు. అప్పుడు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ సర్క్యులర్‌ను అడ్డుకొని కార్మికులకు బేసిక్ ప్రొటెక్షన్ పెంచుతూ వేతనం నష్టపోకుండా వారికి ఆర్డర్స్ ఇప్పించిందని తెలిపారు. టీబీజీకేయస్ యాజమాన్యంతో మాట్లాడి ఆ సర్క్యులర్‌ను రద్దు చేసి కార్మికుల వేతనాలు నష్టపోకుండా బేసిక్ ప్రొటెక్షన్‌తో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మికుల పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు భయ్య మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు బి జగ్గయ్య, శేషు, మారం శ్రీనివాస్, ఖైరిగూడ ఫిట్ కార్యదర్శి జూపాక రాజేష్ పాల్గొన్నారు.

'సంఘాన్ని బలోపేతం చేస్తున్నాం'



నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాన్ని బలోపేతం చేస్తున్నామని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి పద్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సుందరయ్య నగర్‌లో పలువురికి సంఘం సభ్యత్వ నమోదు చేయించారు. రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై తమ సంఘం పోరాటాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె



నవతెలంగాణ-జన్నారం

తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగుతుందని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం మండలాధ్యక్షులు శ్రీనివాస్ అన్నారు. ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరుతూ చేపట్టిన సమ్మె మంగళవారానికి 12వ రోజుకు చేరుకుంది. జూనియర్ పంచాయతీ కార్యదర్శులంతా తెల్ల చొక్కాలు ధరించి నిరసన తెలిపారు. సాయంత్రంలోపు తమను ఉద్యోగాల్లో చేరాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె చేస్తామని వారు స్పష్టం చేశారు. ప్రభుత్వం భేషజాలకు పోకుండా వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు లావణ్య, సరిత, అజాజ్, శ్రీనాథ్, శ్రీకాంత్, ప్రసాద్ పాల్గొన్నారు.

హరితహారానికి సమాయత్తం కావాలి

నవతెలంగాణ-తాండూర్

వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో పంచాయతీల అధికారులు హరితహారానికి సమాయత్తం కావాలని డిప్యూటీ సీఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని కిష్టంపేట నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ అధికారులు మొక్కలు నాటే ప్రదేశాలను ఎంచుకొని గుంతలు తవ్వేందుకు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నర్సరీలోని మొక్కలు ఎదిగేందుకు అన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. పంచాయతీ అధికారులు నర్సరీలో నిర్దేశించిన మొక్కల కంటే లెక్క తక్కువ కాకుండా చూసుకోవాలని తెలిపారు. ఆయనతో పాటు ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎంపీఈఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి కిష్టంపేట చంద్రమౌళి పాల్గొన్నారు.

కార్పొరేట్ జనరల్ మేనేజర్‌కు సన్మానం



నస్పూర్ : నూతన కార్పొరేట్ జనరల్ మేనేజర్ (సివిల్) టి.సత్యనారాయణను శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ సూర్యనారాయణ ఇప్పటి వరకు కంపెనీకి చేసిన సేవలను కొనియాడుతూ ఇకముందు కూడా కార్పోరేట్ జనరల్ మేనేజర్ సివిల్‌గా నైపుణ్యత, అనుభవంతో సివిల్ విభాగానికి సంబంధించిన అన్ని పనులను అత్యంత సమర్థవంతంగా చేయగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం పర్సనల్ పి అరవిందరావు, డిజీఎం సివిల్ క్వాలిటీ బెల్లంపల్లి రీజియన్ నాగేశ్వరరావు, డీజీఎం సివిల్ శివ రావు, డీజీఎం ఐఈడి చిరంజీవులు, ఆర్కే7 గ్రూప్ ఏజెంట్ సత్యనారాయణ, క్వాలిటీ మేనేజర్ కె వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్ఈ పర్చేస్ చంద్రశేఖర్,ఎస్ఈ సివిల్ రాము,సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శ్రీధర్,గుండె రావు పాల్గొన్నారు.

కేసీఆర్ కుటుంబ పాలనను తరిమికొట్టాలి

- కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ మంత్రి పురుషోత్తం రూపాల



నవతెలంగాణ - కాగజ్‌నగర్

తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలనను తరిమికొట్టాలని, బీజేపీ అధికారంలోకి రావాలంటే కేవలం బూత్ స్థాయిలో పని చేసే కార్యకర్తలతోనే సాధ్యమని కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ మంత్రి పురుషోత్తం రూపాల బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం పటేల్ గార్డెన్ లో నిర్వహించిన లోక్‌సభ ప్రభాస్ యోజన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బంగారు తెలంగాణగా ఏర్పడుతుందని ప్రజలందరూ ఆశతో ఉంటే సీఎం పదవిపై కూర్చొని కేసీఆర్ తన సొంత కుటుంబాన్ని బంగారు కుటుంబంగా మార్చుకొని తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రమంతట అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదు కాని ఏక్కడో పంజాబ్‌లో, ముంబైలో అక్కడున్నటువంటి రైతులకు ఐదు లక్షల చెక్కులు ఇచ్చి అక్కడున్న రైతులను ఆదుకుంటామని సీఎం చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఢిల్లీ నుంచి కేంద్రం విడుదల చేసే నిధులు నేరుగా గ్రామపంచాయతీకి చేరేలా పీఎం మోదీ నేతృత్వంలో పారదర్శక పాలన సాగుతోందన్నారు. సర్పంచులకు రావలసిన బిల్లుల కోసం ఎమ్మెల్యేల చుట్టూ తిరగకుండా నరేంద్ర మోడీ ప్రభుత్వం నేరుగా వారి అకౌంట్లలో డబ్బులు వేస్తున్నారని అన్నారు. రైతుల భూమిని తక్కువ ధరకు తీసుకొని ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు కొన్ని వేల కోట్లు ఖర్చుపెట్టి కాలువలు తవ్వి ప్రాజెక్టులు కట్టకుండా ప్రజలను మోసం చేశారన్నారు. సిర్పూర్ తాలూకాలో అంబేద్కర్ సృజన స్రవంతి ప్రాజెక్టును ఇక్కడి నుంచి కాళేశ్వరానికి తరలించి సిర్పూర్ తాలూకాకు తీరని అన్యాయం చేశారన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి గుణపాఠం చెప్పి బీజెపిని అధికారంలో తీసుకురావడానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని తెలిపారు. అంతకుముందు దాడానగర్ సమీపంలోని కొమరంభీం విగ్రహానికి పూలమాలవేసి నివాళ్ళర్పించారు. త్రిశూల్ పహాడ్ లక్ష్మీనారాయణ స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, తాలుకా నాయకులు పాల్వాయి హరీష్, కొంగ సత్యనారాయణ, దోణి శ్రీశైలం, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు భూస్థాయి కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల్ కమిషన్ సిఫార్సులను పూర్తిగా అమలు చేయాలి

- మంచిర్యాలలో బీసీ సంఘాల నిరసన ప్రదర్శన



నవతెలంగాణ-హాజీపూర్

దేశ జనాభాలో 60 శాతం ఉన్న బీసీల న్యాయమైన సమస్యల పరిష్కారం కొరకు మండల్ కమిషన్ సిఫారసులను పూర్తిగా అమలు చేయాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1989లో నాటి వీపీ సింగ్ ప్రభుత్వం బీసీలకు సామాజిక న్యాయం దక్కాలనే సదాశయంతో మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేయబూనుకున్నప్పుడు మనువాద శక్తులు అద్వానీ నాయకత్వంలో రథయాత్ర చేపట్టి మండల్ కమిషన్ సిఫార్సులు పూర్తిగా అమలు కాకుండా అడ్డుకున్నారని తెలిపారు. మండల్ కమిషన్ సిఫార్సులు ఇచ్చి 40 సంవత్సరాలు అవుతున్నా గద్దెమీద కూచున్న ప్రభుత్వాలు ఆ సిఫార్సుల ఊసే ఎత్తకపోవడం అంటే అది బీసీలను రాజకీయ రంగంలోనే కాకుండా అన్ని రంగాల్లో వివక్ష గురి చేయడమే అవుతుందన్నారు. ఏ పార్టీ అధికారం చేపట్టాలన్నా బీసీల ఓట్లతోనే సాధ్యమన్న విషయాన్ని ప్రభుత్వాలు గుర్తించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీల న్యాయమైన సిఫార్సులను అమలు చేసి బీసీల ఆకాంక్షను నెరవేర్చాలని, లేనిపక్షంలో బీజేపీ ప్రభుత్వాన్ని బీసీ సమాజం ముందు దోషులుగా నిలబెడతామని పేర్కొన్నారు.

బీహార్‌లోని నితీష్ కుమార్ ప్రభుత్వం బీసీ జనాభా లెక్కలు సేకరించడానికి ప్రయత్నాలు మొదలుపెడితే కుల దురహంకారులు కోర్టులో కేసు వేసి అడ్డుకోవడం ఆక్షేపణీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇక ఆలస్యం చేయకుండా బీసీ జనాభా లెక్కలు సేకరించి బీసీలకు దక్కాల్సిన న్యాయమైన వాటాను అందించడానికి ప్రయత్నించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు గుమ్ముల శ్రీనివాస్, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేష్, సీనియర్ బీసీ నాయకులు గజ్జెలి వెంకటన్న, నార్ల మహేందర్, సమ్ము రాజన్న, సోమన్న, అరెందుల రాజేశం, పలస శ్రీనివాస్, లక్ష్మణ్, చంద్రమౌళి పాల్గొన్నారు.

ఇండ్ల స్థలాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే జోగు రామన్నకు జర్నలిస్టుల వినతి



నవతెలంగాణ- ఆదిలాబాద్‌టౌన్

ఇండ్ల స్థలాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని జర్నలిస్టులు ఎమ్మెల్యే జోగు రామన్నకు వినతిపత్రం అందించారు. మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యేను పలువురు జర్నలిస్టులు కలిసి ఇండ్ల స్థలాల ప్రక్రియపై చర్చించారు. అతి త్వరలోనే అర్హులైన అందరికీ ఇండ్ల స్థలాలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే భరోసానిచ్చారు. ఈ విషయమై ఇది వరకే జిల్లా కలెక్టర్‌తో చర్చించినట్లు వివరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీనియర్ జర్నలిస్టులు బిర్కూర్‌వార్ వెంకటేష్, కందుల మహేందర్, రాజేష్, మెడపట్ల సురేష్, గొల్లన నరేష్, సారంగపాణి, రొడ్డ దేవిదాస్, ఎడపు రవింధర్, ఏర సుధాకర్, సంద సురేష్, షేక్ మొయిజ్, సిడాం రవి, సుభాష్, అస్మత్, ఖిజర్‌యాఫై, పసుపుల స్వామి, నిలేష్, అభిలాష్, మహేష్ తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులకెళ్లి మహిళ మృతి

నవతెలంగాణ-కోటపల్లి



ఉపాధి హామీ పనులకు వెళ్లి పనులు చేస్తుండగా తీవ్ర అస్వస్థతకు గురై మహిళ మృతి చెందింది. చెన్నూర్ మండలంలోని కన్నెపల్లి గ్రామానికి చెందిన మొగిలి లచ్చు(52) గ్రామ సమీపంలో జరుగుతున్న కుంట పూడిక పనులకు వెళ్లింది. తోటి కూలీలో కలిసి పనులు చేస్తుండగా ఒక్కసారిగా పని ప్రదేశంలో కుప్ప కూలింది. దీంతో ఆందోళనకు గురైన తోటి కూలీలు వెంటనే గ్రామానికి తీసుకొచ్చారు. లచ్చు ఇంటికి చేరుకునేలోపే ప్రాణాలు విడిచింది. ఎండ తీవ్రత కారణంగానే ఆమె అస్వస్థతకు గురై మృతి చెందిందని స్థానికులు తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో గంగాభవానీ గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వపరంగా రూ.2లక్షల బీమా పరిహారం వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. పీసీసీ సభ్యులు నూకల రమేష్ సైతం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. ఎండ తీవ్రతతోనే లచ్చు మృతి చెందిందని, ప్రభుత్వం కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బెల్లంపల్లి సిఓఈలోఉత్తమ ఫలితాలు

తాండూర్ : ఇంటర్మీడియట్ బోర్డు మంగళవారం ప్రకటించిన ఫలితాల్లో బెల్లంపల్లి సిఓఈ ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపల్ ఐనాల సైదులు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో సిలివేరు వినయ్ 969 మార్కులు, బైపీసీ విభాగంలో మల్లెపూల సాయి 954 మార్కులతో కళాశాల టాపర్స్‌గా నిలిచారు. బైపీసీలో 31 మందికి 31 మంది పాసయ్యారు. ఎంపీసీలో 32 మందికి 31 మంది పాసై 97శాతం ఫలితాలు సాధించారన్నారు. మొత్తం 63 మందికి 57 మంది ఏ గ్రేడ్, నలుగురు బి గ్రేడ్ సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో గొల్ల బలరాముడు 470 మార్కులకు 464 మార్కులు, బైపిసి విభాగంలో మూడ్ సాయికిరణ్ 440మార్కులకు 410 మార్కులతో కళాశాల టాపర్స్‌గా నిలిచారు. మొత్తం ప్రథమ సంవత్సరంలో 70 మందికి 41 మంది ఏ గ్రేడ్, 17 మంది బి గ్రేడ్, 6 గురు సి గ్రేడ్ సాధించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో మొత్తం 50మంది విద్యార్థులు ఫిజిక్స్‌లో అరవైకి అరవై (వందశాతం)మార్కులు సాధించినట్లు తెలిపారు. టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీరామ వర్మ, మిట్టా రమేష్, కట్ల రవీందర్, గాజుల రాజేందర్, అనుముల అనిరుద్, అకెనేపల్లి రాజేష్, మహ్మద్ రఫీ, సుకరి అర్జున్, చందా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆదిలాబాద్ రీజియన్ సంక్షేమ గురుకులాల ఆర్సీఓ కొప్పుల స్వరూపరాణి ఫోన్ ద్వారా అభినందించారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



కౌటాల : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్యతో కలిసి వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఎ-రకం గ్రేడ్ వడ్లకు క్వింటాల్‌కు రూ.2060, బి-రకం గ్రేడ్ వడ్లకు రూ.2040 ధర చెల్లించనున్నట్టు తెలిపారు. రైతులు వడ్లను తీసుకొచ్చేటప్పుడు ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, పట్టా పాస్ పుస్తకం జిరాక్స్ ప్రతులు రెండు సెట్లు తీసుకొచ్చి ఏఓ, ఏఈఓల ధృవీకరణ పత్రం సైతం అందజేయాలని తెలిపారు. చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులెవరు అధైర్య పడొద్దన్నారు. కార్యక్రమంలో పార్టీ సర్పంచ్ కొడిపె లక్ష్మీబాయి ఆనంద్‌రావు, వ్యవసాయ సహాయ సంచాలకులు జాటోత్ మనోహర్, ఏఓ రాజేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు చౌదరి అంజన్న, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమ్మె విరమణ

జన్నారం : సమస్యలు పరిష్కరించాలని నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గ్రామ పారిశుధ్య కార్మికులు మంగళవారం సమ్మెను విరమించారు. ఈవోపీఆర్డీ రమేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు రాజమల్లు మాట్లాడుతూ గ్రామ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. 51వ జీవోను రద్దు చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం

నస్పూర్ : ఆర్కే-7 గ్రూప్ ఏజెంట్ సత్యనారాయణ బదిలీపై ఖైరగూర ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా వెళ్తున్న సందర్భంగా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సత్యనారాయణ ఆర్కే7 గ్రూప్ గనుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధన కోసం అహర్నిశలు కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ పురుషోత్తమరెడ్డి, శ్రీరాంపూర్ ఉపరితల గని, ప్రాజెక్టు ఇంజనీర్ చంద్రశేఖర్, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

నర్సరీలోని మొక్కలపై దృష్టి సారించాలి

నవతెలంగాణ-నార్నూర్



గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలోని మొక్కలపై దృష్టి సారించాలని ఎంపీడీఓ కావల రమేష్ సూచించారు. మంగళవారం మండలంలోని భీంపూర్ గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న నర్సరీని సందర్శించారు. నర్సరీలో నాటిన మొక్కలను పరిశీలించారు. మొక్కలు రాని చోట వేరే మొక్కలను నాటాలని సూచించారు. ఎండకు మొక్కలు ఎండిపోకుండా రోజు క్రమం తప్పకుండా నీరు వేయాలని నర్సరీలో నిర్లక్ష్యం వహించవద్దని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. వారి వెంట సర్పంచ్ రాథోడ్ విష్ణు, వైద్యురాలు రాజమణి, ఏతః సుభాని, టీఏ సురేష్, ఏఎన్ఎం శ్యామక ఫీల్డ్ అసిస్టెంట్ నర్సరీ నిర్వహకులు ఉన్నారు.

డబ్బులు రాక ఉపాధి కూలీల ఇబ్బందులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉపాధి హామీ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని బీజేపీ రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి మండిపడ్డారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు 100 రోజుల పనిదినాలు కల్పించాలనే సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధిహమీ చట్టాన్ని జిల్లాలో సరిగా అమలు చేయడం లేదని అన్నారు. ఉపాధి హామీ చట్టానికి కేంద్రం రూ.4వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తోందని, ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడ ఖర్చు చేస్తుందో తెలపాలని పేర్కొన్నారు. ప్రజలు పనులు చేస్తున్న 2 నెలలుగా కూలి డబ్బులు వాళ్లకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మందికి వచ్చినా బ్యాంక్ అధికారులు రుణం కింద జమ చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించాలని లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని అన్నారు.

ఎమ్మెల్యేకు ఐకేపీ వీఓఏల వినతి



నవతెలంగాణ-తాంసి

తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుకు ఐకేపీ వీఓఏలు వినతిపత్రాన్ని అందజేశారు. తమ డిమాండ్ల సాధనకు సమ్మె చేస్తున్న తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. భీంపూర్ మండలంలోని అంతర్గాం గ్రామానికి పెండ్లికి హాజరు కాగా, భీంపూర్ మండల కేంద్రంలోని ఐకేపీ వీఓఏలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మి న్యాయమైన డిమాండ్ కోసం నిరవధిక సమ్మె చేస్తున్న మీ గొడును ప్రభుత్వానికి తెలియజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు అరుణ్, వీఓఏలు రాంజీ, గోవింద్‌రావ్, రజిత రమేష్, సంతోష్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని దంతన్‌పల్లి గ్రామానికి చెందిన లచ్చన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని మంగళవారం ఎమ్మెల్యే రేఖా నాయక్ పరామర్శించారు. రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. అధైర్య పడవద్దని ధైర్యానిచ్చారు. అనంతరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకే సీఎం కేసీఆర్ ఇలాంటి గొప్ప పథకం తీసుకువచ్చారని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ సర్కార్ ఓ మోడల్‌గా తీర్చిదిద్దారని, ప్రస్తుతం జాతీయ స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు తగు కార్యచరణతో ముందుకు వెళుతున్నారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేసినంత అభివృద్ధి గతంలో ఎన్నడూ చూడలేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకవచ్చిన పథకాలే తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చే విధంగా చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంద్ర జైవంత్ రావు, వైస్ ఎంపీపీ బాలాజీ, పార్టీ మండల అధ్యక్షుడు కందుకూరి రమేష్, నాయకులు అజీమోద్దిన్, దాసండ్ల ప్రభాకర్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత

నవతెలంగాణ-లక్ష్మణచాంద

గాయత్రి బ్యాంకులో నిర్భయ సేవింగ్స్ ఖాతా కలిగిన మండలంలోని తిర్పెల్లి గ్రామానికి చెందిన బడుగరి భీమేష్ ప్రమాదశావత్తు మరణించగా మృతుని భార్య బడుగరి సుజాతకు జిల్లా కేంద్రంలోని గాయత్రి బ్యాంకులో లక్ష రూపాయలు చెక్కును పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి మంగళవారం అందించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఖాతాదారుల అభ్యున్నతికి యాజమాన్యం కృషి చేస్తోందని అన్నారు. భీమా అందజేసిన బ్యాంకు సిబ్బందిని తిర్పెల్లి గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ రాజశేఖర్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

వోకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

- మండల టాపర్‌గా నిలిచిన తోట సంధ్య



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలోని సాయి బాలాజీ ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ఇందులో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎంఎల్‌టీ విభాగంలో శ్రీరామ్ నగర్‌కు చెందిన తోట సంధ్య వెయ్యికి 945 మార్కులు సాధించి, ఖానాపూర్ మండల టాపర్‌గా నిలిచింది. ఎంఎల్‌టీ విభాగంలో రెండో స్థానంలో శ్రీరామ్‌నగర్‌కు చెందిన పరిమి పూజిత వెయ్యికి 907, ఎంపీహెచ్‌డబ్ల్యూ విభాగంలో మస్కాపూర్‌కు చెందిన గొల్లపల్లి శివాని వెయ్యికి 874, ఈటీ విభాగంలో దూదేకుల ఇర్ఫాన్ వెయ్యికి 872 ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మొదటి సంవత్సరం ఎంఎల్‌టీ విభాగంలో చదువుతున్న సైని సాయి ప్రియ 471/500, మండాది సందీప్ 442/500, సాధించిన వారిని వొకేషనల్ కళాశాల కరెస్పాండెంట్ పి వెంకట రమణ, ప్రిన్సిపల్ సురేష్ విద్యార్థులను అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో పూలాజీ బాబా విద్యార్థుల ప్రభంజనం

నవతెలంగాణ-ఉట్నూర్



ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు రాసిన పరీక్ష ఫలితాలు మంగళవారం ప్రభుత్వం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో ఉట్నూర్‌లోని శ్రీపూలాజీ బాబా జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. వెయ్యి మార్కులకు గాను స్మిత అనే విద్యార్థి బైపీసీ సెకండ్ ఇయర్‌లో 987 మార్కులు, ఎంపీసీలో అశోక్ 971, ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో నితిన్ 460కి 449, బైపీసీలో రియజోద్దీన్ 460కి 418 అత్యధిక మార్కులు సాధించి ఔరా అనిపించుకున్నారు. రాష్ట్ర స్థాయిలో ఇలాంటి మార్కులు సాదించినందుకు విద్యార్థులను పూలజీ బాబా కళాశాల యాజమాన్యం సభ్యులు, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, డైరెక్టర్ రితేష్ రాథోడ్, డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లారెడ్డి, శేషులతో పాటుగా అధ్యాపకులు, తోటి విద్యార్థులు వారిని అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్ : ఆదిలాబాద్‌లోని కైలాస్‌నగర్ 33 కేవీ ఫీడర్, మావల 33 కేవీ ఫీడర్ లలో మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్ మండలంలోని ఖానాపూర్, కైలాస్ నగర్ దస్నాపూర్, రిమ్స్ సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 9:00 గంటల నుంచి సాయంత్రం 04:00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. సబ్‌స్టేషన్‌ల పరిదిలోని వినియోగదారులందరు సహకరించగలరని కోరారు.

భక్తులకు అన్ని సౌకర్యాలు

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలో నేటి నుంచి మూడు రోజుల పాటుగా జరిగే తిరుమల, తిరుపతి దేవస్థానం విగ్రహ ప్రతిష్టాపన మహాపూజ కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని స్థానిక సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం గ్రామ పంచాయతీ పరిసర ప్రాంతాలలో పారిశుధ్య పనులు చేపట్టారు. విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. నేటినుంచి మూడు రోజుల పాటుగా జరగనున్న విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సీఈఐఆర్ ద్వారా బాధితులకు ఫోన్లు అందజేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ జిల్లాలో సెల్ ఫోన్‌లు పోగొట్టుకున్న 5గురికి సీఈఐఆర్ ద్వారా లభించిన సెల్ ఫోన్‌లను తిరిగి బాధితులకు జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి మంగళవారం అందజేశారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన నారాయణ గత జనవరి నెలలో బోరజ్ చెక్‌పోస్ట్ వద్ద తన మొబైల్ ఫోన్ జేబు నుండి జారి విడిచిపోయిందని, జైనథ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. అనిత ఆదిలాబాద్ పట్టణంలోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని జైజవాన్ నగర్‌లో నివసిస్తున్నప్పుడు వీధిలో గోడపై ఉన్న సెల్ ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు తస్కరించినట్టు తెలిపారు. పర్వీజ్ సుల్తానా జనవరి నెలలో ఒక పెళ్లి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో తన సెల్ ఫోను పోడగొట్టుకున్నట్టు తెలియజేశారు వెంటనే మావల పోలీస్ స్టేషన్‌లో అభ్యర్థనను అందించారు. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగారెడ్డి రాంనగర్ సమీపంలో ద్విచక్ర వాహన నడిపే సందర్భంగా తన మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నట్టు తెలియజేశారు. తలమడుగు పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన సత్యనారాయణ తలమడుగు బస్టాండ్‌లో తన మొబైల్ ఫోన్ పడగొట్టుకున్నట్టు తెలియజేశారు. వీరందరికీ సీఈఐఆర్ వెబ్‌సైట్ లో గాని సంబంధిత పోలీస్ స్టేషన్‌లో గాని వ్యక్తిగతంగా గాని అభ్యర్థనను అందించిన వెంటనే తమ మొబైల్ ఫోన్‌లను తిరిగి స్వాధీనం చేసుకుని అవకాశం ఉంటుందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. మొబైల్ ఫోన్లు దుర్వినియోగం కాకుండా వాటిని పనిచేయకుండా చేసే విధానం కూడా ఈ నూతన వెబ్‌సైట్ ద్వారా అందుబాటులోకి వచ్చిందని తెలియజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎస్ శ్రీనివాసరావు, రాములు నాయక్, సీఐ చంద్రమౌళి, సైబర్ సెల్ సిబ్బంది సింగ్వర్ సంజీవ్ కుమార్, రియాజ్ అహ్మద్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ హటావో దేశ్‌కో బచావో



నవతెలంగాణ-తాంసి

దేశ ప్రజలను దగా చేస్తున్న అసమర్థత నరేంద్ర మోడీ ప్రభుత్వం తక్షణమే గద్దె దిగాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా బీజేపీ హటావో దేశ్‌కో బచావో అంటూ జిల్లా కార్యవర్గ సభ్యులు చిలుక దేవిదాస్ ఆధ్వర్యంలో ఇంటింటికి సీపీఐ ప్రజా పోరుయాత్ర తాంసి మండల పరిధిలోని ఘోట్కురి గ్రామంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరిస్తూ నయవంచన పాలన సాగిస్తుందని ధ్వజమెత్తారు. మోడీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత దేశంలోని అన్ని ప్రభుత్వ రంగాలు దివాలా తీసి తీవ్రమైన సంక్షోభం ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం అచ్చేదిన్ అంటూనే పేదలు సామాన్య మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచే విధంగా ధరలు పెంచుతూ కార్పొరేట్ ధనవంతులకు మాత్రం అచ్చేదిన్ తెచ్చారని పేదలకు మాత్రం సచ్చే దినాలు వచ్చాయని ఆరోపించారు. ఇలాంటి అప్రజాస్వామిక మోడీ ప్రభుత్వం కొనసాగేందుకు వీలులేదని రాబోయే సాధారణ ఎన్నికల్లో మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధం కావాలని అన్నారు. మోడీ మత రాజకీయ విధానాలకు రాజకీయ సమాధి కడతామని హెచ్చరించారు. ప్రతి ఇంటికి సీపీఐ పేరుతో ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామని ప్రజలు సీపీఐ ప్రచార జాతల్లో పెద్ద ఎత్తున భాగస్వాములై రాజకీయ చైతన్య ఒరవడితో కలిసి రావాలని కోరారు. సీపీఐ ప్రజాపోరు యాత్ర పార్టీ కార్యవర్గ సభ్యులు మెస్రం భాస్కర్, కౌన్సిల్ సభ్యులు గేడం కేశవ్, సీనియర్ నాయకులు గణపతి, శాఖ కార్యదర్శి ప్రభాకర్, ఎల్లన్న, నర్సింగ్, హిబ్రహీం, తన్విర్, రాజేశ్వర్, ఆశన్న, అడెల్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఎంఆర్ఐ స్కానింగ్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఉమ్మడి అదిలాబాద్ జిల్లాతో పాటు పక్కనే ఉన్న మహారాష్ట్ర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఆదిలాబాద్ జిల్లాకు తలమానికంగా నిలిచే రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని రూ.150 కోట్లతో నిర్మించారాని అందులో ఎంఆర్ఐ యంత్రాన్ని ఏర్పాటు చేయాలని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ జనరల్ సెక్రటరీ సామ రూపేష్ రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర వైద్య, మౌలిక సదుపాయాల జీఎం రాంబాబు నాయక్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అయితే అనారోగ్యంతో బాధపడుతున్న వారినిప్రస్తుతం అసౌకర్యాలు వేధిస్తుండగా అదే తరహాలో కోట్ల రూపాయలు పెట్టి నిర్మించిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అసౌకర్యాలు ప్రజలకు స్వాగతం పలుకుతున్నాయని అన్నారు. ముఖ్యంగా ఎంఆర్ఐ స్కానింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేయకపోవడం చాలా బాధాకమని అన్నారు. ఈ సౌకర్యం లేకపోవడం వల్ల జిల్లా ప్రజలు ఎప్పటిలాగే వేల రూపాయలు ఖర్చు చేసి హైదరాబాద్, నిజామాబాద్, మహారాష్ట్రలోని తదితర ప్రాంతాలకు స్కానింగ్ కోసం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభించి, నెలలు గడుస్తున్న ఎంఆర్ఐ స్కానింగ్ సౌకర్యం ఏర్పాటు చేయకపోవడం చాలా బాధాకరమని అన్నారు. ఇప్పటికైనా ఎంఆర్ఐ స్కానింగ్ ఏర్పాటు చేసి జిల్లా ప్రజల కష్టాలు దూరం చేయాలని జీఎంని కోరారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించారని, తొందరలోనే ఎంఆర్ఐ స్కానింగ్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

ఆరోగ్య మహిళా పథకం సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్య మహిళా పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాధన అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళలను వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతవారం వచ్చిన మహిళలకు చేసిన పరీక్షలు వాటి రిపోర్టులను పరిశీలించి అధికారులకు తగిన సలహాలు సూచనలు ఇచ్చారు. ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళలందరూ ఆరోగ్యంగా ఉండాలని లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఒబేసీటీ, రక్త, మూత్ర పరీక్షలు, క్యాన్సర్ పరీక్షలు, న్యూట్రిషన్ మొదలైన పరీక్షలను స్థానిక ఆస్పత్రిలో చేసి రోగనిర్ధారణ అనంతరం నివారణ కోసం మందులు ఇవ్వడంతో పాటు అవసరం ఉన్నవారికి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులకు రిఫరల్ చేయనున్నట్టు ఆమె తెలిపారు. గ్రామీణ ప్రాంతంలోని నిరుపేదలు వైద్య పరీక్షలు చేయించుకోలేని స్థితిలో ఉన్న మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు భీంరావ్, శిల్పా, ఆలేఖ్య, హెచ్ఈ రమణారావు, హెచ్ఈఓ సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

మతా శిశు సంరక్షణకు నిరంతర చర్యలు తీసుకోవాలి

- మతా శిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి విజయ్ సారధి

నవతెలంగాణ-ఉట్నూర్



ఉట్నూర్, ఇంద్రవెల్లి సబ్ సెంటర్ ల పరిధిలోని మతా శిశు సంరక్షణకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని మతా శిశు సంరక్షణ జిల్లా ప్రోగ్రాం అధికారి విజయ్ సారధి అన్నారు. మంగళవారం స్థానిక కేబీ ప్రాంగణంలోని పీఎమ్మార్సీ భవనంలో మండలంలోని దంతన్‌పల్లి, శ్యాంపూర్, హస్నాపూర్, ఇంద్రవెల్లి, పిట్టబొంగరం పీహెచ్‌ల పరిధిలోని మెడికల్ అధికారులు, స్టాఫ్ నర్సులు, సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులతో మతా శిశు సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయ్ సారధి పాల్గొని మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి సాధారణ ప్రసవాలు అయ్యేంత వరకు ఎలాంటి ఆహారం, అన్ని వైద్య పరీక్షలు, ప్రసవ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు, సలహాలు అందించారు. ప్రసవ సమయంలో మహిళలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ముందస్తుగా వారికి అవగాహన కల్పించి సాధరణా ప్రసవం అయ్యే విధంగా చూడాలని అన్నారు. గర్భిణీ స్త్రీల వివరాలు ఎప్పకప్పుడు మెడికల్ అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. ఎలాంటి నిర్లక్ష్యం చేసిన తల్లిబిడ్డలకు హని జరుగుతుందని వీటిని దృష్టిలో పెట్టుకోని వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, హెచ్ఈఓ శ్రీనివాస్, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఇంటర్మీడియట్‌లో బాలికలదే హవా

నవతెలంగాణ-తలమడుగు

ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో బాలికలదే హవా కొనసాగుతోంది. మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో మండలంలోని లింగి కేజీబీవీ, ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థుల్లో బాలికలదేపై చేయిగా హవా కొనసాగింది. కేజీబీవీ ఇంటర్ సెకండియర్ 59 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా కేవలం ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఫెయిల్ కాగా, బైపీసీ సబ్జెక్టులో రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అధిక శాతం మార్కులు సాధించిన వారిలో వెయ్యిలో లసికా 968, నవ్య 948, కళ్యాణి 927, రజిత 915, మౌనిష 908, పల్లవి 905, ఎంపీసీ కళ్యాణి9, అంజలి 886, మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల్లో 48 మంది విద్యార్థుల హాజరు కాగా, ఒకరు మాత్రమే ఫెయిల్ అయ్యారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అధిక శాతం మార్కులు సాధించిన వారిలో 470 గాను నవ్య 470, కీర్తన 411, బైపీసీలో శాలిని 440, లక్ష్మి 376, స్త్రీలేఖ 375, యోగిత 374 అత్యధిక మార్కులు సాధించిన వారిలో ఉన్నారు. ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న రెండో సంవత్సరం విద్యార్థుల్లో శ్రావణి 843, చంద్రిక 832, మొదటి సంవత్సరం విద్యార్థుల్లో జస్వంత్ 422, హారిక 381 ఉత్తీర్ణత శాతం పొందిన వారిలో ఉన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

గత ప్రభుత్వాల పాలనలో నిరాదరణకు గురైన ఆదిలాబాద్ పట్టణాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మంగళవారం 21వ వార్డులో ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని, రూ.30లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం రూ.45లక్షలతో అభివృద్ధి చేసిన మోక్షధామాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే స్థానికులతో సరదాగా ముచ్చటించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోట్లాది రూపాయల వ్యయంతో అనేక అభివృద్ధి పనులు చేపడుతూ ప్రజల ఇబ్బందులను దూరం చేస్తున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హయంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరును ప్రజలకు వివరించారు. సమగ్ర అభివృద్దే పరమావధిగా ప్రభుత్వం అహర్నిశలు పాటు పడుతోందని పేర్కొన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతిపక్షాలు అనవసర దుష్ప్రచారాలు చేస్తూ రాజకీయ పబ్బం గడుపుకునే ప్రయత్నాలు చేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, నాయకులు కొండ మీనాగణేష్, పందిరి భూమన్న, మెట్టు ప్రహ్లాద్, గజు రాథోడ్, గోలి శంకర్ పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో కేజీబీవీ విద్యార్థుల ప్రభంజనం



నవతెలంగాణ-దిలావర్‌పూర్

ఇంటర్మీడియట్ ఫలితాల్లో మండల కేంద్రలోని కస్తుర్బా కళాశాల విద్యార్థులు అత్యధిక ఉత్తీర్ణత సాధించి, ప్రభంజనం సృష్టించారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో 29 విద్యార్థులకు గాను 28 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బైపీసీ మొదటి సంవత్సరంలో 40 విద్యార్థులకు గాను, 39, ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో 28 విద్యార్థులలో 27, బైపీసీ ద్వితీయ సంవత్సరంలో42 విద్యార్థులలో 41 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 69 విద్యార్థులకు గాను, 67 విద్యార్థులు, 97 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 70 మంది విద్యార్థులకు 68 మంది విద్యార్థులు 97 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 139 విద్యార్థులకు 135 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని కేజీబీవీ అపర్ణ తెలిపారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో కె.భోజవ్వ 960, బైపీసీ ద్వితీయ సంవత్సరంలో కె.స్రవంతి 962, ఎంపీసీ మొదటి సంవత్సరంలో 441, బైపీసీ మొదటి సంవత్సరంలో 380 అత్యున్నతమైన మార్కులు సాధించి కేజీబీవీ కళాశాలకు కీర్తి ప్రతిష్టలు సాదించారని, విద్యార్థులందరూ ఉన్నతమైన స్థాయిలో ఉండాలని కేజీబీవీ ఎస్‌ఓ అపర్ణ అన్నారు.


ఇంటర్ ఫలితాల్లో మండల టాపర్‌గా అర్జున్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. స్థానిక టీడబ్ల్యూ గురుకుల కళాశాలలో 100శాతం ఫలితాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ శ్రీప్రియా తెలిపారు. ఎంపీసీ సెకండ్ ఇయర్‌లో అస్మిత 954 మార్కులు, బీపీసీలో సరోడే గౌతమిలు 946 మార్కులు వచ్చాయని తెలిపారు. మొత్తం 141 విద్యార్థులు పరీక్ష రాయగా 100 శాతం ఫలితాలు సాధించారని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ సెకండ్ ఇయర్‌లో మొత్తం 53 మందికి గాను 100 శాతం ఫలితాలు సాధించగా, బీపీసీలో మొత్తం 69 గాను 68 ఉత్తీర్ణులు కాగా, 99 శాతం ఫలితాలు సాధించామని ప్రిన్సిపాల్ బి.ధన్ రాజ్ తెలిపారు. ఎంపీసీ సెకండ్ ఇయర్‌లో టాపర్‌గా బన్సీ అర్జున్ 956 మార్కులు, సాబ్లే పవన్ 955 మార్కులు రాగా, బీపీసీలో పద్వాల్ శారద 950, కేంద్రే సోను 944 మార్కులు సాధించారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండలంలో అదనపు కలెక్టర్ రాంబాబు మంగళవారం ఆకస్మికంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. రైతులకు ఇబ్బంది లేకుండా వరి ధాన్యం కొనుగోలు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. కొనుగోలు పూర్తి అయిన వెంటనే ట్యాబ్‌లో కొనుగోలు వివరాలు నమోదు చేసి, త్వరితగతిన డబ్బులు రైతుల అకౌంట్లలో జమ అయ్యేలా చూడాలని సిబ్బందికి సూచించారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో మద్దతు ధరకు అమ్ముకోవాలని కోరారు. అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ కవితరెడ్డి, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, డీసీఎంఎస్ సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ - వాంకిడి

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఆమని వెయ్యి మార్కులను 948, కమలాబాయి 933, స్రవంతి 967, విజయలక్ష్మి 949, జి లక్ష్మిబాయి 948, సీఈసీ ద్వితీయ సంవత్సరం శ్రీధర్ 878, జె సాయివంశీ 855 మార్కులు సాధించారు. మొత్తం 150 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 149 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 96.66 శాతం ఉత్తీర్ణత సాధించారు. సీఈసీ మొదటి సంవత్సరం వేణు 500 మార్కులకు 421, విష్ణు 413 మార్కులు సాధించారు. 164 మంది పరీక్షలు రాగాయ 161 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 98.17 శాతం ఫలితాలు సాధించామని కళాశాల ప్రిన్సిపల్ సంపత్‌కుమార్ తెలిపారు.

యోగాలో రెబ్బెన వాసుల ప్రతిభ

నవతెలంగాణ - రెబ్బెన

తెలంగాణ యోగాసనం స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 3 నుండి 7 వరకు నిర్వహించిన ఆంథెన్స్ జెడ్జెస్ ట్రెనింగ్ ప్రోగ్రాంలో గోలేటికి చెందిన సత్యం అలేఖ్య, కేసరి అలేఖ్య ప్రతిభ కనబరిచారు. సోమవారం సిద్ధిపేటలో జరిగిన కార్యక్రమంలో మంత్రి తన్నీరు హరీష్‌రావు ఉత్తీర్ణత సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ యోగా నేటి సమాజానికి అవసరమని, సమాజం ఆరోగ్యంగా ఉండడానికి యోగా ద్వారా చేసే సేవలు గొప్పవన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్, ఉపాధ్యక్షుడు రాంచంద్రరావు, జాయింట్ సెక్రటరీ తోట సతీష్, సిద్ధిపేట జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు కోట అశోక్, ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు అయితా అంజయ్య పాల్గొన్నారు.

ఇంటర్‌లో విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీ సెకండియర్‌లో కల్వల అర్షిత 1000 మార్కులకు 975 సాధించి మొదట స్థానంలో నిలిచింది. ఎంపీసీలో బండి అభినందిని 962 సాధించింది. సీఈసీలో సింధు 847 మార్కులు సాధించింది. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో అజ్మీర వైష్ణవి 470 మార్కులకు 436 మార్కులు సాధించింది. బైపీసీలో అస్మిత 377 మార్కులు సాధించింది. సెకండియర్‌లో మొత్తం 95 మందికి 90 మంది ఉత్తీర్ణులు కాగా 94.7 శాతం ఫలితాలు సాధించారు. ఇంటర్ ఫస్టియర్‌లో 79 మందికి 65 పాస్ కాగా 82.2 శాతం ఫలితాలు సాధించారు. ఒకేషనల్లో ఎంపీహెచ్ డబ్ల్యూ (ఫీమేల్) సెకెండియర్లో జే రేణుక 1000 మార్కులకు 965 మార్కులు సాధించింది. ఈటీ సెకెండియర్లో బి శివ కుమార్ 948 మార్కులు సాధించాడు. ఎంపీహెచ్ డబ్ల్యూ (ఫీమేల్) బి మేఘన 500 మార్కులకు 458 సాధించింది. ఈటీ ఫస్టియర్లో ఆర్ అరుణ్ కుమార్ 500 మార్కులకు 467 సాధించాడు. సెకెండియర్లో 32 మందికి 30 పాస్ కాగా వంద శాతం ఫలితాలు సాధించారు. ఫస్టియర్లో 41 మందికి 38 పాస్ కాగా 92.68 శాతం ఫలితాలు సాధించారు.

తెలంగాణ మోడల్ కళాశాలలో..

తెలంగాణ మోడల్ కళాశాలలో బైపీసీ సెకెండియర్లో మారం దేవిక 925 మార్కులు సాధించింది. ఎంపీసీలో రత్నం అర్పన 896, సీఈసీలో ప్రద్వీరాజ్ 893 మార్కులు సాధించాడు. ఫస్టియర్ ఎంపీసీలో మహేశ్ బాబు 470 మార్కులకు 422, సీఈసీలో హరిచందన 500 మార్కులకు 946 మార్కులు సాధించారు. సెకెండియర్లో 73 మందికి 64 మంది పాస్ కాగా 87.67 శాతం ఫలితాలు సాధించారు. ఫస్టియర్లో 51 మందికి 43 పాస్ కాగా 84.31 శాతం ఫలితాలు సాధించారు.

ఉత్తమ ప్రతిభ కనబరిచిన కరిమల విద్యార్థులు



నవతెలంగాణ-జన్నారం

ఇంటర్ ఫలితాలలో మండలానికి చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ చాటారు. కిష్టాపూర్ కేజీబీవీకి చెందిన విద్యార్థులు 90శాతం ఉత్తీర్ణత సాధించారు. కరిమల, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కరిమల కళాశాలకు చెందిన తమన్నానాజ్ ఎంపీసీలో అత్యధిక మార్కులు సాధించి కళాశాలలో మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మణ్, శరత్ కుమార్, శ్రీవాణి అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో కేజీబీవీ ప్రభంజనం

నవతెలంగాణ - బెజ్జూర్


పావని
నాగేశ్వరి
పి. సోని
పి. నాగమణి

ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో కస్తూర్బా గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించగా మొదటి సంవత్సరంలో 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. గత సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించిన కస్తూర్బా గురుకుల పాఠశాల ఈ సంవత్సరం కూడా మంచి ఫలితాలను సాధించింది. దీంతో మండలవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకాధికారి అరుణ చొరతో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించగలిగారని విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొదటి సంవత్సరంలో 56 మందికిగాను 55 మంది ఉత్తీర్ణత సాధించగా ద్వితీయ సంవత్సరంలో 56 మంది ఉత్తీర్ణత సాధించారు. సీఈసీ మొదటి సంవత్సరంలో నాగమణి 500 మార్కులకు గాను 454, ఎంపీహెచ్‌డబ్ల్యు పావని 500ల మార్కులకు గాను 471, ద్వితీయ సంవత్సరంలో సీఈసీలో నాగేశ్వరి వెయ్యి మార్కులకు గాను 899, ద్వితీయ సంవత్సరంలో ఎంపీహెచ్‌డబ్ల్యు సోని వెయ్యి మార్కులకు గాను 958 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారు. వీరందరికి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు మండలవాసులు శుభాకాంక్షలు తెలిపారు.

దివాకర్ అన్న పెరుగన్నం ప్రారంభం



నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలోని సీసీసి కార్నర్, శ్రీరాంపూర్ కాలనీ బస్టాండ్ ఏరియాలో దివాకర్ అన్న పెరుగన్నాన్ని మంగళవారం నడిపెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నడిపెల్లి విజిత్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నడిపెల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా వేసవికాలంలో ప్రజలకు పెరుగన్నం పెడుతున్నామన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నస్పూర్ పట్టణ అధ్యక్షులు అక్కూరి సుబ్బయ్య, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి మెరుగు పవన్ కుమార్, కౌన్సిలర్‌లు వంగ తిరుపతి, బెడికే లక్ష్మి, చిడం మహేష్, సీనియర్ నాయకులు కమలాకర్‌రావు తిప్పని రామయ్య, ముత్తే రాజేశం, బాకం నాగేష్, వార్డుల అధ్యక్షులు రవిగౌడ్, రఫీఖాన్, మహేందర్, ఎస్‌సి సెల్ నాయకులు నాగరాజు, యూత్ నాయకులు గొల్ల నాగార్జున, గుమ్ముల ప్రవీణ్, ఆకుల రమేష్ పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ఆసిఫాబాద్ అదరహో..!

- **ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ద్వితీయ స్థానం**
- **సత్తా చాటిన ప్రభుత్వ కళాశాలలు**


దీపిక
కోట సూర్య
పవన్‌కళ్యాణ్
పెందూర్ రాజు
యశస్రీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర ఫలితాలలో జిల్లా 80.16శాతం ఉత్తీర్ణతతో ద్వితీయ స్థానంలో నిలిచింది. అభివృద్ధిలో ఇతర జిల్లాల కంటే వెనుకబడినా మంగళవారం నాటి ఫలితాలలో ప్రభంజనం సృష్టించింది. గత సంవత్సర ఫలితాలతో పోలిస్తే నాలుగు శాతం పెరిగినప్పటికీ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రంలో మేడ్చల్ తర్వాత రెండో స్థానం సంపాదించింది. రెండు ఫలితాలు కలిపి రాష్ట్రంలో మేడ్చల్ రంగారెడ్డి తర్వాత మూడో స్థానంలో నిలిచి ఇతర జిల్లాలకు విద్యార్థులు ఆదర్శప్రాయంగా నిలిచారు.

సత్తా చాటిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు

ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు సత్తా చాటారు. మహాత్మ జ్యోతిబాపూలే కళాశాల విద్యార్థిని దీపిక బిశ్వాస్ 985/1000 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలువగా, ఆసిఫాబాద్ మోడల్ స్కూల్ విద్యార్థిని యశస్వి 976 మార్కులు, జైనూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి పెందూరి రాజు 973, కాగజ్ నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి పవన్ కళ్యాణ్ 969 మార్కులు సాధించి అత్యంత ప్రతిభ కనబరిచారు.

రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో జిల్లా

ఇంటర్ ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థుల్లో 4000 మంది పరీక్షలకు హాజరు కాగా 3249 మంది ఉత్తీర్ణులయ్యారు. 81 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ ఫలితాల్లో 697 మందికి 544 మంది ఉత్తీర్ణత (78 శాతం మూడవ స్థానం) సాధించారు. ప్రథమ సంవత్సరం జనరల్ ఫలితాల్లో 4371 మంది విద్యార్థులకు 3227 మంది ఉత్తీర్ణత సాధించారు. (74శాతం ఉత్తీర్ణతతో మూడవ స్థానం). ప్రథమ సంవత్సరం ఒకేషనల్ ఫలితాల్లో 766 మంది విద్యార్థులకు 521 మంది ఉత్తీర్ణత సాధించారు (68 శాతం ఉత్తీర్ణతతో రెండవ స్థానం) సంపాదించారు.

మెరిసిన ఆదర్శ కళాశాల విద్యార్థులు

ఆదర్శ కళాశాలలో నాలుగు గ్రూపులకు ద్వితీయ సంవత్సరంలో 154 మంది విద్యార్థులు ఉండగా 136 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో 140కి 130 మంది ఉత్తీర్ణత సాధించారు. కళాశాలలో 48 మంది 900పైగా మార్కులు సాధించారని, వారందరికీ కళాశాల ప్రిన్సిపల్ అబ్దుల్ ఖలీల్ అభినందనలు తెలిపారు.

శ్రీ చైతన్య కళాశాల విద్యార్థుల ప్రతిభ

జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బైపిసి ఆంగ్ల మాధ్యమం చదువుతున్న అబూజార్ 968 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచారు. ద్వితీయ సంవత్సరంలో 242కు 173 మంది, ప్రథమ సంవత్సరంలో 175కు 136 మంది ఉత్తీర్ణత సాధించి కళాశాలకు పేరు తీసుకురావడంతో కరస్పాండెంట్ రాజశేఖర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ విద్యార్థులను అభినందించారు.

ఉత్తమ ఫలితాలకు కృషి అభినందనీయం : డీఐఈఓ శ్రీధర్ సుమన్

గత సంవత్సరంతో పోలిస్తే నాలుగు శాతం అధిక రిజల్ట్ సాధించడం, రాష్ట్రంలో ద్వితీయ స్థానం సంపాదించడం సంతోషంగా ఉందని డీఐఈఓ శ్రీధర్ సుమన్ తెలిపారు. ఫలితాలపై తన కార్యాలయంలో అధ్యాపకులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫలితాల సాధనలో అహర్నిశలు కృషి చేసిన అధ్యాపకులకు, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. గత సంవత్సరం రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచి ప్రస్తుతం ఆ స్థానం సంపాదించకపోవడం కొంత బాధాకరమైనప్పటికీ భవిష్యత్తులో తిరిగి ప్రథమ స్థానంలో నిలబడడానికి మొదటి నుంచి విద్యార్థులను సిద్ధం చేస్తామన్నారు. జిల్లాలో గన్నారంలోని మహాత్మ జ్యోతిబాపూలే, దహెగాం కేజీబీవీ కళాశాలలు వంద శాతం ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు.


మోడల్ కళాశాలలో విద్యార్థులకు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర మంత్రికి టీడబ్ల్యూజేఎఫ్ వినతి

నవతెలంగాణ - కాగజ్‌నగర్

ఆదిలాబాద్ లోకసభ ప్రవాస్ యోజన కార్యక్రమంలో పాల్గొనేందుకు మంగళవారం కాగజ్‌నగర్ పట్టణానికి వచ్చిన కేంద్ర మత్స్య, పాడి పరిశ్రమ, డెయిరీ శాఖా మంత్రి పురుషోత్తం రూపాలకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు వినతి పత్రం ఇచ్చారు. కరోనా సమయంలో కేంద్రం నిలిపివేసిన రైల్వే పాసులను పునరుద్ధరించాలని, ఎప్పటి నుండో హామీకే పరిమితమవుతున్న ఇల్లు, ఇళ్ల స్థలాలు కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, జర్నలిస్టులకు నిర్దిష్ట గౌరవ వేతనం చెల్లించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సమస్యలను సంబంధిత శాఖ దృష్టికి తీసుకెళ్తానని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతి రాజశేఖర్, జాతీయ కౌన్సిల్ సభ్యులు టి సురేందర్ రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నీలి సతీష్, కోశాధికారి జి కృష్ణమోహన్ గౌడ్, సభ్యులు ఎం.విష్ణుగౌడ్, నాగేందర్, జర్నలిస్టులు వి. వెంకన్న, జలీల్, జి. మహేష్, కృష్ణంరాజు గౌడ్, లలిత్, సమీర్, ఖిజర్ హుస్సేన్ పాల్గొన్నారు.



బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రతి ఖాతాదారుని బ్యాంకు ఖాతాకు ఆధార్, మొబైల్ నెంబర్ అనుసంధానం చేయాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయితో కలిసి జిల్లా గ్రామీణాభివృద్ధి, సంక్షేమ, పరిశ్రమలు, బ్యాంకర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వార్షిక సంవత్సరం రుణ నిర్దేశిత లక్ష్యాలను సాధించే విధంగా బ్యాంకర్లు కృషి చేయాలని, వ్యవసాయ, స్వయం సహాయక సంఘాలు, కార్పొరేషన్ రుణ లక్ష్యాల సాధన దిశగా దృష్టి సారించాలని తెలిపారు. బ్యాంకర్లు ఎపిఎంల సమన్వయంతో క్షేత్రస్థాయిలో రుణ లక్ష్యాల సాధన దిశగా పనిచేయాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాల గ్రూపులకు మంజూరు చేసిన యూనిట్లు, పాల ఉత్పత్తిలో భాగంగా గేదెల కొరకు అందిన దరఖాస్తులను పరిశీలించాలని, స్త్రీ నిధి రుణాలు, రైతులకు పంట రుణాలు సకాలంలో మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎస్‌సి, బిసి, మైనారిటీ శాఖల రుణాలపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ హనుమంతరావు, వివిధ బ్యాంకుల మేనేజర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేంత వరకూ పోరాటం



నవతెలంగాణ - సిర్పూర్(టి)

ఐకేపీ వీఓఏల సమస్యలను పరిష్కరించే వరకూ పోరాటం ఆపేది లేదని సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాల కృష్ణమాచారి అన్నారు. మంగళవారం ఐకేపీ కార్యాలయం ఎదుట వీఓఏలు చేస్తున్న దీక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వీఓఏలపై ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని తెలిపారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రతి కార్మికునికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించే వరకు సీఐటీయూ సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. కార్యక్రమంలో గొర్కుటె జయంత్, వీఓఏ ఉద్యోగుల జిల్లా నాయకులు కుటికెల ఆనంద్, మండల నాయకులు దర్శన్, దస్రు, బొర్కుటె సాయినాథ్, జర్పుల మోహన్, రాజేష్, బానోత్ అంబావతి, స్వప్న, ప్రమీల, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫలితాల్లో మెరిసిన మాతృశ్రీ కళాశాల

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని మాతృశ్రీ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో మెరిశారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 82శాతం ఉత్తీర్ణత సాధించగా ప్రథమ సంవత్సరంలో 86 శాతంమంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో అభినయ 971 మార్కులు సాధించగా, శ్రీజన్‌రెడ్డి 965 మార్కులు సాధించి ప్రథమ ద్వితీయ స్థానాలు సంపాదించారు. మొదటి సంవత్సరంలో సాత్విక 458, అక్షిత 458, అక్షయ 456 మార్కులు సాధించారు.

ఇంటర్ ఫలితాల్లో మెరిసిన మండల విద్యార్థి

నవతెలంగాణ-కెరమెరి



వికారాబాద్ జిల్లాలోని మోదుగుల్ చిట్టెంపల్లిలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన ధనోర గ్రామానికి చెందిన ముకరం కుమారుడు ముస్తాకిం 983 మార్కులు సాధించి జిల్లాలో టాపర్‌గా నిలిచాడు. మారుమూల గ్రామం నుండి విద్యార్థి టాపర్‌గా నిలవడం పట్ల తల్లిదండ్రులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ఇంటర్‌లో 97 శాతం ఉత్తీర్ణత

ఇంటర్ ఫలితాల్లో కెరమెరి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 97శాతం ఉత్తీర్ణత సాధించి సత్తా చాటారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 97.41శాతం ఉత్తీర్ణత సాధించగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 97.71శాతం ఉత్తీర్ణత సాధించి సత్తా చాటారు.

అవయవ దానానికి ముందుకొచ్చిన సతీష్‌రెడ్డి



కాసిపేట : మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీకి చెందిన అసిస్టెంట్ మేనేజర్ (ప్రాసెస్) జి. సతీష్‌రెడ్డి అవయదానానికి ముందుకొచ్చారు. మరణానంతరం నేత్రదానం, అవయవదానం చేసేందుకు మంగళవారం ముందస్తు ఒప్పంద పత్రాలపై సంతకం చేసి సోపతి వెల్ఫేర్ సొసైటీ- జైపూర్ అధ్యక్షులు భీమ్ పుత్ర శ్రీనివాస్ జలంపెల్లి ద్వారా సదాశయ ఫౌండేషన్‌కు అందజేశారు. మరణం అనంతరం కూడా పదిమంది జీవితాల్లో వెలుగులు నింపే మహదవకాశం అవయవదానంతో సాధ్యమౌతుందని, అందుకే అవయవదానం చేయడానికి ముందుకు వచ్చానని సతీష్‌రెడ్డి తెలిపారు. వీరిని ఆదర్శంగా తీసుకొని అపోహలు వీడి ప్రతి ఒక్కరూ అవయవదానానికి ముందుకు రావాలని భీమ్‌పుత్ర శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డిని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, అవయవ దాతలు సి. బాబ్జీ ప్రత్యేకంగా అభినందించారు.

కార్యదర్శులకు నోటీసును ఉపసంహరించుకోవాలి

నవతెలంగాణ - కాగజ్‌నగర్

పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నదని, సమ్మె చేస్తున్న కార్యదర్శులను తొలగిస్తామని ప్రభుత్వం ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులతో చర్చించి సామరస్యంగా పరిష్కరించకుండా అణిచివేత ధోరణికి పాల్పడుతోందన్నారు. యూనియన్ పెట్టుకొని సమ్మె చేస్తున్నందున తొలగిస్తామని ఆదేశాలు జారీ చేయడం బాధాకరమన్నారు. యూనియన్ పెట్టుకోవడం ఉద్యోగుల హక్కు అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు, పారిశ్రామిక కార్మికులకు ప్రతి ఒక్కరికి యూనియన్లు పెట్టుకునే, సమ్మె హక్కు ఉందని గుర్తు చేశారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ - కాగజ్‌నగర్

ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీని ఎన్నికున్నట్టు రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ తెలిపారు. ప్లీనరీ సమావేశాలు విశ్రాంతి ఉద్యోగుల భవనంలో నిర్వహించారు. ఈ ప్లీనరీలో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా 17 మందితో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా యస్.సతీష్, జిల్లా ఉపాధ్యక్షులుగా మీసారి చిరంజీవి, ఎండి జాఫర్, వి సాయికుమార్, జిల్లా కార్యదర్శిగా తుమ్మిడే భీమేష్, జిల్లా సహాయ కార్యదర్శులుగా డోకె నవీన్, సుంకరి సాయి క్రిష్ణ, జిల్లా కమిటీ సభ్యులుగా డి ప్రకాష్, దేవిశ్రీ ప్రసాద్, కే సాయిరాం, ఎస్ నితీష్ శైలజ, రామ్ చందర్, రాజేందర్, ఎస్ నవీన్‌ను ఎన్నుకున్నారు. విద్యారంగంలో సమస్యలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ విద్యార్థులను ఐక్యం చేస్తూ విద్యార్థుల సమస్యల కోసం అనునిత్యం నూతన కమిటీ పోరాడాలని సూచించారు.

ఇంటర్‌లో వంద శాతం ఉత్తీర్ణత

నవతెలంగాణ - దహెగాం

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. బైపీసీ మొదటి సంవత్సరంలో 440 మార్కులకు 421 మార్కులను సాధించి పాలె అంజలి(ప్రభుత్వ జూనియర్ కళాశాల) ప్రథమ స్థానాన్ని దక్కించుకుంది. ద్వితీయ సంవత్సరంలో రమాదేవి వెయ్యి మార్కులకు 980 మార్కులు సాధించి మొదటిస్థానాన్ని కైవసం చేసుకుంది. కేజీబీవీ ఎంపీసీ మొదటి సంవత్సరంలో అల్లం శైలజ 470 మార్కులకు 460 మార్కులు సాధించి మొదటి స్థానం కైవసం చేసుకుంది. ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో దేవాడి అనూష వెయ్యి మార్కులకు 972 మార్కులను సాధించి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. సీఈసీ మొదటి సంవత్సరంలో హరికృష్ణ 416 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలవగా సీఈసీ ద్వితీయ సంవత్సరంలో కార్తీక్ 892 మార్కులు సాధించి మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. కేజీబీవీ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులు వంద శాతం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 99 శాతం ఉత్తీర్ణత సాధించారు.

రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు


లిఖితశ్రీ
గాయత్రి

నవతెలంగాణ-లక్షెట్టిపేట్

పట్టణంలోని గురుకుల బాలికల కళాశాల, కేజీబీవీ విద్యార్థులు మంగళవారం ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్స్ లలిత కుమారి, కవిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురుకుల బాలికల కళాశాలకు చెందిన సీనియర్ ఇంటర్ విద్యార్థులు లిఖితశ్రీ ఎంపీసీలో 988, గాయత్రి బైపీసీలో 985, శృతి ఒకేషనల్‌లో 989 మార్కులు, జూనియర్ ఇంటర్‌లో మల్లేశ్వరి ఎంపీసీలో 464, రంజిత బైపీసీలో 433, అలేఖ్య ఒకేషనల్‌లో 496 మార్కులు సాధించారు. కేజీబీవీ విద్యార్థులు సౌజన్య ఎంపీసీ 979, శ్రావణి 979, సంగీత బైపీసీలో 968, సారిక 953 మార్కులు, అదేవిధంగా జూనియర్ ఇంటర్‌లో సంకీర్తన ఎంపీసీలో 459, పూజిత 454, నక్షత్ర బైపీసీలో 365 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ కవిత పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆయా కళాశాలల అధ్యాపకులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

చెరువులో చేపలు మృతి



నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని ఆలుగామ గ్రామంలో రామటెంకి చిన్నన్న చేపల చెరువులో చేపలన్నీ మృతి చెందాయి. మూడు సంవత్సరాలుగా చేపల పెంపకమే జీవనాధారం చేసుకొని భార్యాభర్తలు జీవనం సాగిస్తున్నారు. ఏమైందో తెలియదు మంగళవారం తెల్లవారుజామున లేచి చూడగానే మూడు వేల చేపలు చనిపోయాయని బాధితులు బోరుమంటున్నారు. ఒక్కొక్క చేప దాదాపు మూడు నుంచి నాలుగు కిలోల వరకు ఉంటుందని, సంవత్సర కాలంగా మేపుతూ పెంచిన చేపలు ఇలా నిర్జీవ స్థితిలో పడి ఉండటం చూసి చిన్నన్న గుండెలు బాదుకుంటున్నాడు. మృతి చెందిన చేపల విలువ దాదాపు 5 నుంచి 6లక్షలు ఉంటుందని బాధితుడు వాపోతున్నాడు. బాధితుడు చేపలు చనిపోయిన విషయాన్ని పోలీస్ అధికారులకు తెలపడంతో ఎస్సై వెంకట్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చేపలను, చెరువులోని నీటిని పరీక్షించడానికి తీసుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి కుటుంబాన్ని ఆదుకోవాలని చిన్నన్న వేడుకుంటున్నాడు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ పట్టణంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని డాక్టర్స్ లైన్‌లో ఫుట్‌పాత్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సహాయ సహకారాలతో పట్టణ అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. రూ.2 కోట్లతో పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం, డాక్టర్ లైన్స్, గాజులపేట్ చౌరస్తా వరకు ఫుట్‌పాత్ నిర్మాణ పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. ఇందులో కమిషనర్ సీవీఎన్ రాజు, డీఈ నాగేశ్వరరావు, ఏఈ హరిభువన్, కాంట్రాక్టర్, సంబంధిత మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నారు.



రైతులు ఆందోళన చెందొద్దు

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

రైతులు వరి ధాన్యం విక్రయించేందుకు ఆందోళన చెందవద్దని సకాలంలో కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేయబడతాయని ఎమ్మెల్యే రేఖా నాయక్ రైతులకు భరోసా ఇచ్చారు. మంగళవారం మండలంలోని మస్కాపూర్ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి, రైతులు లాభాలు గడించాలని అన్నారు. రైతుకు మద్దతు ధర లభించాలంటే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని స్పష్టం చేశారు. అకాల వర్షాలకు తడిసి ముద్దయిన వరి ధాన్యాన్ని సైతం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ప్రకృతి వైపరీత్యానికి ఎవరు బాధ్యులు కారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ ఇప్ప సత్యనారాయణరెడ్డి, సీఈఓ భూమి ఆశన్న, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌లతో పాటు నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్

నవతెలంగాణ-సిరికొండ



ఇంటర్ మొదటి సంవత్సర ఫలితాల్లో మండల వాసి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. ధర్మసాగర్ గ్రామానికి చెందిన చౌహాన్ మురళిధర్, శీలాబాయి దంపతుల తనయుడు చౌహాన్ ప్రదీప్ నాయక్ హైదరాబాద్ మియాపూర్ జేఎన్టీయూ వశిష్ఠ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం వెలుడిన ఫలితాల్లో ఎంపిసి గ్రూప్‌లో 470 మార్కులకు 467 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ పొందాడు. తల్లి వ్యవసాయ కూలి పనులు చేస్తూ, తండ్రి సిరికొండలో చిరు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన ప్రదీప్ నాయక్‌ను మండల వాసులు అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. సెకండ్ ఇయర్‌లో 1000 మార్కులకు గాను చార్వితరెడ్డి 988, శ్రీహర్షిత 988, రాథోడ్ అక్షయ 988, పవార్ హరిక్రిష్ణ 988, రాధిక అగర్వాల్ 988 మార్కులు సాధించారు. 28 మంది విద్యార్థులు 980 మార్కులకుపైగా సాధించారు. ఫస్ట్ ఇయర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను సూక్వీర్ కౌర్ 466, గులే మాధవ్ 465, కర్డం అనగ్రశ్రీ 465 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను ఏ.అక్షయ 436, అను 435, రాథోడ్ దివ్య 433, క్యాథమ్ బిందు 433 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎస్ఆర్ కళాశాల చైర్మెన్ వరదరెడ్డి, డైరెక్టర్స్ సంతోష్ రెడ్డి, మధుకర్ రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపల్స్ కే.బ్రహ్మం, జైపాల్‌రెడ్డి, అరవింద్, అధ్యాపకులు, విద్యార్థులకు మంగళవారం కళాశాలలో అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో కాలేజ్ టాపర్‌గా ప్రత్యూష

నవతెలంగాణ-నార్నూర్

ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థిని ప్రత్యూష 1000 మార్కులకు గాను 961 మార్కులు సాధించి కాలేజ్ టాపర్‌గా నిలిచింది. ఇంటర్ మొదటి సంవత్సరంలో 81 శాతం, రెండో సంవత్సరంలో 94 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో నలంద విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్ ఫలితాల్లో ఆదిలాబాద్ పట్టణంలో నలంద కాలేజీకి చెందిన విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. రెండో సంవత్సరం ఎంపీసీలో 1000 మార్కులకు గాను నిషిత 985, పూజ 979, కరణ్ 922, దానిష్ 907, చంటి ప్రసాద్ 905 మార్కులు సాధించారు. రెండో సంవత్సరం బైపీసీలో 1000 మార్కులకు గాను ప్రణీత్ 969, వైష్ణవి చౌహాన్ 957, ఆఖిఫ్ 946, శృతి 941, ఖుషి 922 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో సూరజ్ 441, ఆలిష్ 435, బైపీసీ మొదటి సంవత్సరంలో ఆదర్శ్ 427, అయాన్ ఖానమ్ 421, మీనాక్షి 407 మార్కులు సాధించారు. అలాగే సీఈసీ రెండో సంవత్సరంలో భూమిక 931, జుహైర్ 926, సీఈసీ మొదటి సంవత్సరంలో కళ్యాణి 482 తల్హా 473 మార్కులు సాధించారు. వీరికి కళాశాల ప్రిన్సిపాల్ పున్నారావ్, యాజమాన్యం అభినందనలు తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు

నవతెలంగాణ-కడెం



ఇంటర్మీడియట్ ఫలితాల్లో మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్, కేజీబీవీ ఎస్ఓ విమల తెలిపారు. కళాశాలలోని విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల వర్షం వ్యక్తం చేసి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కళాశాలలో ప్రయివేట్ కళాశాలలకు ధీటుగా విద్యాబోధన ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రక్షిత 984, గౌతమి 982, స్వాతిక 980, శ్రావణి 980, అపర్ణ 958, అక్షయ 944, శైలజ 836, ప్రథమ సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పుష్పలత 486, అరుణ 450, సంధ్య 464, ప్రవీణ 431కు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ విమల, కేజీబీవీ అధ్యాపక బృందం, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, నచ్చన్ ఎల్లాపూర్ సర్పంచ్ బొడ్డు గంగన్న, వైస్ ప్రిన్సిపాల్ రాధిక, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ వేణుగోపాలకృష్ణ కూతురు సుహాసిని పుట్టినరోజు సందర్భంగా ఆస్పత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. హైదరాబాద్‌లో ఎంబీబీఎస్ చదువుతున్న సుహాసిని మాట్లాడుతూ తన పుట్టిన రోజు ఆస్పత్రిలో నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సాయి, బ్లడ్‌బ్యాంక్ పీఆర్వో రాకేష్, ఆరోగ్యశ్రీ సిబ్బంది శ్రీనివాస్, రాకేష్, రంజిత్, ధరాంసింగ్, రాము పాల్గొన్నారు.

విద్యారంగం సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ కృషి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందని రాష్ట్ర కార్యదర్శి నాగరాజు అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని అన్నారు. మహనీయుల జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో నుండి తొలగించడం సరికాదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సైతం విద్యావ్యవస్థపై చిన్నచూపు చూస్తోందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి పట్ల నిరంతరం ఎస్ఎఫ్ఐ ముందుండి పోరాడుతుందని అన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేయాలని అన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్, జిల్లా కార్యదర్శి ఆత్రం నగేష్, నాయకులు సోజర్ ఉన్నారు.



పకడ్బందీగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రక్రియ

- 618 మందికి ఇండ్లు కేటాయింపు



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రక్రియ మంగళవారం పకడ్బందీగా పారదర్శకంగా నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లక్కీడ్రా కార్యక్రమంలో ఆయన పాల్గొని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకాన్ని ప్రారంభించిందని అన్నారు. అర్హులైన ఇల్లులేని నిరుపేదలకు అందించేలా చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఆదిలాబాద్ పట్టణ పరిధిలోని 32 వార్డులకు చెందిన 2,538 మంది అర్హులైన లబ్దిదారులకు లక్కీ డ్రా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన రిజర్వేషన్ ప్రకారం వికలాంగుల కేటగిరిలో 242 మందికి గాను 32 మందికి, ఎస్సీ కేటగిరిలో 256 మందికి గాను 115 మందికి, ఎస్టీ కేటగిరి క్రింద 148 మందికి గాను 38 మందికి, మైనారిటీ కేటగిరి క్రింద 1079 మందికి గాను 81 మందికి, జనరల్ కేటగిరి కింద 352 మందికి లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసి మొత్తం 618 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియను ఎలాంటి అపోహలకు తావులేకుండా వీడియో, ఫోటోగ్రఫీ చిత్రీకరిస్తూ, పూర్తి పారదర్శకంగా నిర్వహించడం జరిగిందన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కొరకు వచ్చిన దరఖాస్తులను రాష్ట్ర ఐటి శాఖకు పంపించడం జరిగిందని తెలిపారు. వారు రూపొందించిన అర్హులైన లబ్దిదారుల జాబితాకు లక్కీడ్రా ద్వారా ఎంపిక చేశామని అన్నారు. ఎంపికైన లబ్దిదారుల జాబితాను ప్రదర్శించడం జరిగిందని, ఏమైనా సందేహాలు ఉంటె ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌లో గాని, తహసీల్దార్‌కు గాని ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియ నిర్వహణకు సహకరించిన లబ్దిదారులకు, రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖల అధికారులకు, ప్రజాప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డీఓ రమేష్ రాథోడ్, తహసీల్దార్లు సతీష్, మున్సిపల్ కమీషనర్ శైలజ, రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ సిబ్బంది, లబ్దిదారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్యదర్శుల సమ్మె

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్ష మంగళవారం 12వ రోజుకు చేరుకుంది. వీరికి మద్దతుగా వివిధ పార్టీలు, సంఘాల నాయకులు నిలిచారు.

సమ్మెకు బీజేపీ నాయకుల మద్దతు..

పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు బీజేపీ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ అన్నారు. మంగళవారం జేపీఎస్‌ల సమ్మెకు మద్దతు తెలిపిన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీలో ఇచ్చిన వాగ్దానాన్ని కూడా నెరవేర్చడం లేదని అన్నారు. న్యాయమైన పంచాయతీ కార్యదర్శుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నగేష్, దినేష్ మటోలియ, ముకుంద్ పాల్గొన్నారు.

మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్పీ) మద్దతు..

జూనియర్ పంచాయతీ సెక్రటరీల సమ్మెకు ఎంఎస్పీ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్టు జిల్లా కోఆర్డినేటర్ కుడాల స్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించిన తెలంగాణ రాష్ట్రంలో జేపీఎస్‌ల పరిస్థితి వర్ణనాతీతమని అన్నారు. పోరాడి సాధించిన తెలంగాణలో నియామకాలు చేపట్టి అగ్రిమెంట్ మీద నియమించిన సెక్రెటరీల ఉద్యోగం మీద దెబ్బ కొట్టే కుట్ర చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. జిల్లా జూనియర్ పంచాయతీ సెక్రటరీలు తమ ఉద్యోగాల రక్షణకొరకు సమ్మె బాట పట్టాల్సిన అవసరం వచ్చిందని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న భాదల కంటే ఎక్కువ భాధలు స్వరాష్ట్రంలో ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కంబ్లే బాలాజీ, జీ.శంకర్, కరెం రవి, అన్నెపాగ అశోక్, రాంప్రసాద్‌లు ఉన్నారు.



ఏఐటీయూసీ మద్దతు...

జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మెకు ఏఐటీయూసీ నాయకులు మంగళవారం పూర్తి మద్దతు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయమైన డిమాండ్లు నెరవేర్చక పోతే రానున్న రోజుల్లో కలిసి పోరాటాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిల్కా దేవిదాస్, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మెస్రం భాస్కర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గెడం కేశవ్‌లు ఉన్నారు.

భారత రాజ్యాంగ గ్రంథాన్ని అందించాలని వినతి



నవతెలంగాణ-ఇచ్చోడ

భారత రాజ్యాంగ గ్రంధాన్ని ప్రతి పౌరుడికి ఉచితంగా అందించాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మోహన్‌సింగ్‌కు వినతిపత్రాన్ని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు అందజేశారు. ముందుగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, అనంతరం రాజ్యాంగ పుస్తకాన్ని చేతిలో పట్టుకొని ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వరకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మండల ధర్మ సమాజ్ పార్టీ ప్రచార కమిటీ నాయకులు పోనుకంటి శేఖర్ మాట్లాడుతూ ఈ దేశాన్ని నడిపిస్తున్నది భారత రాజ్యాంగమని అన్నారు. అలాంటి గ్రంథం పట్ల నూటికి 90శాతం ప్రజలకు అవగాహన లేకనే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం విఫలమైపోతున్నదని అన్నారు. దీనివల్ల ప్రజా జీవితం అన్ని రంగాల్లో అభివృద్ధి లేక అధోగతి పాలవుతోందని అన్నారు. భారత రాజ్యాంగం ద్వారా సామాన్య ప్రజలు అవకాశాల్లో అంతస్తులు ముందడుగు వేసి ప్రధాన స్రవంతిలో కలవడానికి ప్రజలందరికీ భారత రాజ్యాంగంపై అవగాహన అవసరం అందుకే ఈ దేశ పౌరులందరికీ భారత రాజ్యాంగం గ్రంధం ఉచితంగా పంపిణీ చేయాలని అన్నారు. దాని ఆవశ్యకత ధర్మసమాజ్ పార్టీ తరపున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ ప్రచార కమిటీ జిల్లా నాయకులు వెంకటేష్, సర్కిల్ నరేష్, మండల నాయకులు దర్శనాల అశోక్, అన్నెల లక్ష్మణ్, పోడుటి ప్రవీణ్, గాస్కంటి లక్ష్మణ్, బడుగు భూమన్న, మచ్చ పోశెట్టి, గురుమూర్తి, బొప్పారపు రాకేష్, రాజు, ప్రవీణ్, రఘు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : ఆదిలాబాద్ వండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ గ్రంధాన్ని ప్రతి పౌరుడికి అందించాలని తహసీల్దార్‌కు ధర్మ సమాజ్ పార్టీ అదిలాబాద్ మండల అధ్యక్షుడు నల్లగంటి రవి మహారాజ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ గ్రంధాన్ని ప్రతి ఒక్కరికి అందించి వారిని చైతన్యవంతులుగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పాలేపు విఠల్ మహారాజ్, సభ్యులు ప్రమోద్ మహారాజ్, సంతోష్ మహారాజ్, ఆశన్న మహారాజ్, రాజు మహారాజ్ పాల్గొన్నారు.

మహారాణాప్రతాప్ వీరత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్



మహారాణా ప్రతాప్ వీరత్వాన్ని ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని నిర్మల్ మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న మహారాణాప్రతాప్ విగ్రహం వద్ద నిర్మల్ రాజ్‌పుత్ సమాజ్ ఆధ్వర్యంలో మహారాణా ప్రతాప్ సింగ్ 483వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ ఈశ్వర్ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి రాజ్‌పుత్ సమాజ్ వారితో కలిసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ మహారాణా ప్రతాప్ గొప్పపోరాట యోధుడని కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పూదరి రాజేశ్వర్, గండ్రత్ రమణ, రాజ్‌పుత్ సమాజ్ అధ్యక్షుడు ఠాగూర్ లక్ష్మణ్ సింగ్, గౌరవ అధ్యక్షుడు గజేందర్ సింగ్, ఉపాధ్యక్షుడు అనిల్ సింగ్, సెక్రటరీ నరేందర్ సింగ్, నారాయణ్ సింగ్, విశాల్ సింగ్, చందూలాల్, కిషన్ సింగ్, హీరా సింగ్, సాయి సింగ్, హనుమాన్ సింగ్ ఉన్నారు.

మేకలు, గొర్లపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-అదిలాబాద్‌రూరల్

ఆదిలాబాద్ మండలంలోని అంకోలి గ్రామంలో మంగళవారం గొర్రెల మేకలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు జేడీఏ కిషన్ హజరయ్యారు. మేకలు గొర్రెల కాపరుల సంఘం సభ్యులతో ఆయన మాట్లాడుతూ రెండో విడత మేకల గొర్రెలను త్వరలోనే తెలంగాణ ప్రభుత్వం అందించనున్నట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ సురేష్, సర్పంచ్ ఇటుకల భూమన్న, మేకలు గొర్ల కాపరుల సంఘం అధ్యక్షుడు అప్కం గంగయ్య, కనక రమణ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

డంకన్‌డ్రైవ్ కేసులో ఒకరికి రెండు రోజుల జైలు

నవతెలంగాణ-నిర్మల్

డ్రంకన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ 32 మందిని మంగళవారం నిర్మల్ ద్వితీయశ్రేణిలో కోర్టులో ప్రవేశపెట్టగా ఒకరికి జైలు శిక్ష, 31 మందికి న్యాయమూర్తి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ 31 మందికి రూ.36వేల 600 జరిమానా విధించారని తెలిపారు. అలాగే ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఏఆర్ఎస్ విద్యార్థులు

నవతెలంగాణ-ఖానాపూర్



ఖానాపూర్ పట్టణంలోని ఏఆర్ఎస్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చిచారు. ద్వితీయ సంవత్సరం బైపీసీ విభాగంలో శ్రీరామ్‌నగర్‌కు చెందిన నిహారిక వెయ్యికి 972, ఎంపీసీ విభాగంలో రక్షిత వెయ్యికి 962, మొదటి సంవత్సరం సహజ 445/500, మదిహాఖానం 405/500 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమేష్, ఇన్‌చార్జి రాజ భూషన్‌లు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో గురుకుల విద్యార్థినుల ప్రతిభ



నవతెలంగాణ-నిర్మల్

ఇంటర్ ఫలితాల్లో నిర్మల్ జిల్లాకేంద్రంలోని సోఫినగర్‌లోని తెలంగాణ రాష్ట్ర గురుకుల బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు రాష్ట్ర, జిల్లా టాపర్లుగా నిలిచారని ప్రిన్సిపాల్ నీరడి గంగాశంకర్, ఉపన్యాసకులు బి. వెంకట్ తెలిపారు. ఎంపీసీ ఫస్ట్ ఇయర్‌లో ఆర్.ఆకాంక్ష 470 మార్కులకుగాను 466, ఎస్. సాగరిక 466, ఎం.చరణ్య 465, బైపీసీ ఫస్ట్ ఇయర్‌లో జి.ఉమ 440 మార్కులకు గాను 434, బి. సంస్కృత 433, రవీనా 433, ఎంపీసీ సెకండ్ ఇయర్‌లో జి.స్రవంతి 1000 మార్కులకు గాను 986, ఎం.యోగిత 986, పి.ధనుష్య 983, వి.స్వాతి 983, బైపీసీ సెకండ్ ఇయర్‌లో ఎ.గంగామణి 982, బి.జ్యోతి 982, పి.స్రవంతి 978, టి.ప్రియలక్ష్మి 947లు మార్కులు సాధించినట్లు తెలిపారు. ఫస్ట్ ఇయర్‌లో 99 శాతం, సెకండ్ ఇయర్‌లో 95 శాతంతో ఉత్తీర్ణత సాధించారని తెలపారు. అధ్యాపకులు బి.వెంకట్, వేణుగోపాల్, వీణారాణి, కల్పన, రోహిణి విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు.

సత్తా చాటిన బోథ్ సాంఘిక సంక్షేమ బాలికలు

నవతెలంగాణ-బోథ్



మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల బాలికలు వంద శాతం ఉత్తీర్ణత సాధించి సత్తా చాటారు. అలాగే మోడల్ స్కూల్, కేజీబీవీలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరంలో బైపీసీ విభాగంలో పి.సాయిశ్రీ 1000 మార్కులకు గాను 984, నందిని 983, బి.అఖిల 982, జే మల్లీశ్వరి 982, జే అనుషా980, ప్రథమ సంవత్సరంలో 440లో పావని 435, ఏ చందన 432, సి హెచ్ మధుషా 431, సీహెచ్ సంజన 431, ఏ ప్రతిభ 430, యం ప్రతిభ 430, అలాగే మోడల్ పాఠశాలలో 1000 మార్కులకు గాను నక్షత్ర 947, మాధురి 943, మనస్విని 976 దుర్గ 447, అంజలి 429, అలాగే కేజీబీవీ పాఠశాలలో 937, ఇంద్రజ మౌనిక 917, ఉమాదేవి 435, అశ్విని 394, సత్తా చాటారు పరీక్షల్లో మంచి మార్కులు సాధించినందుకు కళాశాల అధ్యాపకులు, తల్లిదండ్రులు అభినందించారు.

మానవ అక్రమ రవాణా అంతం చేద్దాం

నవతెలంగాణ-తాంసి

మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ యూనిట్ కృషి చేస్తుందని పోలీస్ అధికారి గురుసింగ్ అన్నారు. మంగళవారం మండలంలోని పొన్నారి గ్రామంలో ప్రజలకు ఉమెన్ ట్రాఫికింగ్ ముప్పును ఎదుర్కోవడానికి జాగ్రత్తలను, పలు సూచనలు తెలియజేస్తు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు, లైంగిక దాడులను అరికట్టేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ముఖ్యంగా బాలికలు సెల్ ఫోన్ నుండి అపరిచిత వ్యక్తులతో మాట్లాడవద్దని ఎవరైనా మీ పట్ల ఫోన్‌లో అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంజీవరెడ్డి, ఉప సర్పంచ్ అశోక్, అంగన్‌వాడీ టీచర్లు గడుగు దేవమ్మ, గంగమ్మ, మహిత ఎన్జీవో కోఆర్డినేటర్ ఇమ్రాన్, వర్ష వాలంటరీ సురేష్ వార్డు సభ్యులు రామన్న, నవీన్ రెడ్డి ఉన్నారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థి కళాశాల విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ - ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్ ఫలితాల్లో ఆదిలాబాద్ పట్టణంలో విద్యార్థి కళాశాలకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. రెండో సంవత్సరం ఎంపీసీలో 1000 మార్కులకు గాను అభిజిత్ 966, ఆర్తి 941, అభిలాష్ 916 మార్కులు సాధించారు. అలాగే బైపీసీ రెండో సంవత్సరంలో 1000 మార్కులకు గాను శ్రావణి 969, సత్యపాల్ 945, యోగేష్ 934, ప్రథమేష్ 932, గాయత్రీ 919, వైభవ్ 916 మార్కులు సాధించారు. అలాగే ఎంఈసీలో సౌమ్య 915 మార్కులు, సీఈసీలో దానిష్ 910 మార్కులు, హెచ్‌ఈసీలో లక్ష్మి 900 మార్కులు సాధించారు. అలాగే మొదటి సంవత్సరంలో ఎంపీసీలో ఆకాష్ 461, రాథోడ్ రవితేజ 447, యోగిత 422, వసీం అక్రమ్ 420, వంశీకృష్ణ 416, శ్రీజ 409, ప్రజ్ఞ 406, రోహిత్ 406 మార్కులు సాధించారు. అలాగే బైపీసీ మొదటి సంవత్సరంలో ఐశ్వర్య 430, శ్రీయ ఠాకూర్ 403 మార్కులు సాధించారు. అలాగే సీఈసీ మొదటి సంవత్సరంలో అఫ్సియా భాను 449 మార్కులు సాధించారు. వీరికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి అభినందనలు తెలిపారు.